క్లుప్తంగా

పెయింటింగ్ కార్మికుల కూలీ రేట్లు పెంపు

నల్లగొండ టౌన్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెయింటింగ్ కార్మికుల కూలీ రేట్లు అక్టోబర్ 1 నుంచి పెంచామని, పట్టణంలోని బిల్డర్లు, ఇంటి యజమానులు సహకరించాలని సీఐటీయూ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు భీమనపల్లి శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో పనిచేస్తున్న పెయింటింగ్ కార్మికులందరూ యూనియన్‌లో సభ్యత్వం తీసుకోవాలని, సంక్షేమ బోర్డు లేబర్ కార్డు తీసుకుని సంక్షేమ పథకాలు పొందాలని కోరారు.

అలైన్‌మెంట్ మార్చాలని వర్షిత్‌రెడ్డికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నల్లగొండ టూటౌన్: గట్టుప్పల్ మండలం తేరటుపల్లి గ్రామంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డికి బుధవారం తేరటుపల్లి గ్రామ రైతులు వినతిపత్రం అందజేశారు. తేరటుపల్లిలో పట్టా భూములు కలిగిఉన్న తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మామిడి ప్రమీల, అచ్చిన మల్లయ్య, ఇస్తారి, పి.మారయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తాం

చిట్యాల: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం నిరంతర పోరాటాలు చేస్తుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ అన్నారు. చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామంలో బుధవారం జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల కోసం పనిచేసే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మల్లం మహేష్, మండల నాయకులు అర్రూరి శ్రీను, మెట్టు నర్సింహ, పరమేశం, గోపాల్, వెంకటేష్, యాదయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

నల్లగొండ టౌన్: సీఐటీయూ 4వ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అక్టోబర్ 8,9 తేదీల్లో సభలు భద్రాచలంలో జరుగనున్నాయని తెలిపారు.

ఆక్రమణలను ఖాళీ చేయండి



ఆలయం సమీపంలో షాపులను పరిశీలిస్తున్న ఎస్ఐ రాజీవ్‌రెడ్డి

కనగల్: దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రధాన రహదారిలో ఆక్రమణలకు గురైన రోడ్డు స్థలాన్ని వ్యాపారులు ఖాళీ చేయాలని కనగల్ ఎస్ఐ కె. రాజీవ్‌రెడ్డి సూచించారు. బుధవారం ఎల్లమ్మ ఆలయ పరిసరాలను చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డితో కలిసి ఎస్ఐ పరిశీలించి మాట్లాడారు. ఎల్లమ్మ ఆలయానికి పండుగ సందర్భంగా వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచించారు. ఆలయం వద్ద ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జినుకుంట్ల చంద్రయ్య గౌడ్, జూనియర్ అసిస్టెంట్ కూసం ఉపేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు వైద్య శిబిరం

నల్లగొండ: పోషణ మాసంలో భాగంగా బుధవారం నల్లగొండలోని ఎఫ్‌సీఐ కార్యాలయంలో ఆరోగ్యవంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబం పేరిట మహిళా ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మేనేజర్ సుధీర్‌కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా కుటుంబాలు మరింత బలపడతాయని, తద్వారా సమాజం సుస్థిర అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నల్లగొండ రివర్ నిమ్స్ ఆస్పత్రి వైద్యురాలు సౌమ్య పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కలైసెల్వి, కె.ఎస్.కె. ప్రసాద్, సంధ్య, స్పందన, సరిత, సునంద, భవ్య, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళా ఉద్యోగికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు

- ఫెన్సింగ్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం
- ఆందోళన చెందుతున్న ప్రజలు, వాహనదారులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

కట్టంగూర్ : మండలంలోని బొల్లేపల్లి, మునుకుంట్ల, ఎరసానిగూడెం, పరడ, ఈదులూరు, పామనగుండ్ల, కట్టంగూర్, పందెనల్లి, గార్లబాయిగూడెం గ్రామాల్లో ప్రధాన వీధుల వెంట, పాఠశాలల సమీపంలో ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో వాటి సమీపంలో నుంచి నిత్యం ప్రజలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. కట్టంగూర్ మండల కేంద్రంలోని ఈదులూరు రోడ్డు వెంబడి 2వ వార్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మనిషి కంటె తక్కువ ఎత్తులో ఉండి ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు గజం దూరంలో కంచె లేకుండా ఉండడంతో వాహనదారులు, కాలినడకన వెళ్లే ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని జంకుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు మండల కేంద్రంలో హైస్కూల్ ప్రహరీ వెంబడి, 3వ వార్డులోని పీఏసీఎస్ కార్యాలయం సమీపంలో, కురుమర్తి రోడ్డులో కంఠమహేశ్వరస్వామి ఆలయం సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

స్పందించని అధికారులు

జనావాసాల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారు. విద్యుత్ బిల్లుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంలో విద్యుత్ శాఖ అధికారులకు లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదకరంగా ఉన్నాయని పలుమార్లు సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదులూరు రోడ్డులో వైన్‌షాప్‌నకు ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఆ ప్రాంత చిన్నారుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రజలు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదం జరగకముందే ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కట్టంగూర్‌లో ఈదులూరు రోడ్డు వెంబడి ప్రమాదకరంగా ఉన్న ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్



కట్టంగూర్ గ్రామ శివారులో కురుమర్తి రోడ్డు వెంబడి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఫెన్సింగ్ లేకపోవడంతో మూగజీవాలు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నాయి. జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లకు విద్యుత్ అధికారులు రక్షణ చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారు. రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ప్రమాదం జరిగితే తప్ప అధికారులు స్పందించేటట్లు లేదు. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

–కల్లూరి వెంకటేశ్వర్లు, కట్టంగూర్

బైక్‌లు చోరీ చేస్తున్న నిందితుల అరెస్టు

నకిరేకల్ : వివిధ ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు చేస్తున్న ఇద్దరు నిందితులను నకిరేకల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2.20 లక్షల విలువ చేసే నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను బుధవారం రాత్రి నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నకిరేకల్ సీఐ వెంకటేశ్ వెల్లడించారు. నకిరేకల్‌లో గత జూలై మాసంలో పోగుల జగన్ సాయి ఇంటి ఎదుట పార్క్ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో బాధితుడు జగన్ సాయి నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో నకిరేకల్ మండలం చందంపల్లి బస్‌స్టేజీ వద్ద జాతీయ రహదారిపై నకిరేకల్ పోలీసులు బైక్‌లను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్ వైపు నుంచి నకిరేకల్ వైపు వస్తున్నారు. వారిని ఆపి తనిఖీ చేయగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌లను చోరీ చేస్తున్నట్లు అంగీకరించారు. పోలీసులు పట్టుకున్న వారిలో నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం ఖానాపూర్‌కు చెందిన పెండ్యాల సుదర్శన్, మరో వ్యక్తి ఒడిషా రాష్ట్రంలోని కోరాపూర్ మండలం మాలీదుస్త గ్రామం వాసి అమన్ ఖోరాగా గుర్తించారు. వీరు కొన్నేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలో బైక్‌లను చోరీ చేసి ఒడిషా రాష్ట్రంలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఒప్పుకున్నారు. వీరిపై గతంలో వివిధ పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదయి ఉన్నాయని సీఐ తెలిపారు. వీరినుంచి రూ.2.20 లక్షల విలువ చేసే నాలుగు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని సీఐ వెంకటేశ్ వివరించారు. కేసును ఛేదించిన ఎస్ఐలు లచ్చిరెడ్డి, కృష్ణాచారి, పోలీసు సిబ్బంది వై.వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మధుకర్, శ్రీకాంత్, సురేష్‌లను ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్, ఎస్ఐలు లచ్చిరెడ్డి, కృష్ణాచారి

దసరా వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మర్రిగూడ : దసరా వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మర్రిగూడ మండల ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి కోరారు. బుధవారం ఆయన మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ.. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, అల్లర్లు సృష్టించి ఇతరులకు ఇబ్బందులు కలిగించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విలేజ్ పోలీస్ ఆఫీసర్లతో పెట్రోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రమాదకరంగా రోడ్డుపై గుంత



చీకటిమామిడి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంత

మునుగోడు: మండలంలోని చీకటిమామిడి గ్రామ సమీపంలో మునుగోడు–చౌటుప్పల్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. కొంపల్లి గ్రామంలోని సంపునకు కృష్ణానీటిని సరఫరా చేసేందుకు పైపులైన్ వేసేందుకు కొన్ని నెలల క్రితం ఈ రోడ్డు మధ్యలో నుంచి పెద్దగాతు తవ్వారు. పైపులు వేసిన వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. కానీ ఆ తవ్విన చోట రోడ్డు కుంగిపోయి రోడ్డుకు అడ్డంగా పెద్ద గుంత ఏర్పడింది. దీంతో ఆ రోడ్డు వెంట రాకపోకలు జరిపే వాహనదారులు దానిని గమనించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధింత అధికారులు స్పందించి రోడ్డు కుంగిన చోట మరమ్మతులు చేపట్టి వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా చూడాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి వేడుకలు

రామగిరి(నల్లగొండ): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రామగిరిలోని కనకదుర్గ ఆలయంలో బుధవారం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి ఉదయ సముద్రంలో చక్కెర స్నానం చేయించారు. వందలాది మంది భక్తులు భజనలు కోలాటాలతో ఊరేగింపు వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు వారణాసి రజనీకాంత్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

చిట్యాల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిట్యాల పట్టణంలోని శ్రీకనకదుర్గ ఆలయంలో బుధవారం శ్రీ కనకదుర్గ అమ్మవారు మహిషాసుర మర్ధిని అలంకరణలో దర్శనమిచ్చింది. ఉత్సవ విగ్రహాలకు నిర్వహించిన రథోత్సవంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కోలాట బృందం సభ్యులు, భక్తులు రథోత్సవంలో పాల్గొని పట్టణంలోని వీధుల్లో ఊరేగింపు చేశారు. వేడుకల్లో ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులుగౌడ్, డైరెక్టర్‌లు గంజి వెంకటేశం, బుద్ద విమల, వరకాంతం నర్సింహారెడ్డి, రుద్రారపు లింగస్వామి, జిట్ట సాయిలు, వనమా నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల : శ్రీ కనకదుర్గ ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

బొప్పారం గ్రామంలో..

కేతేపల్లి: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కేతేపల్లి మండలంలోని బొప్పారం గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద బుధవారం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దైద రవీందర్, ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెరుమాళ్ళ శేఖర్, సింగిల్ విండో డైరెక్టర్ కేషయ్య , ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలని హైవేపై రాస్తారోకో

- రోడ్డు ప్రమాదంలో చిట్యాల మండలం వెలిమినేడు వాసి మృతి



రాస్తారోకో చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి పరిహారం చెల్లించి సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. వివరాలు.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన మహంకాళి సురేష్ తన భార్య కవిత, కుమారులు యశ్వంత్, గౌతమ్‌లను తీసుకుని దసరా పండుగకు నారాయణపురం మండలం లింగంవారిగూడెం గ్రామంలోని అత్తగారి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో చౌటుప్పల్ మండలంలోని దామెర గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వేగంగా వచ్చిన కారు వీరి బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్ చనిపోయాడు. అతడి భార్య, కుమారులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో ఉన్నారు. కాగా పరిహారం చెల్లింపు విషయమై మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కారు యజమాని సంబంధితులతో సమావేశమయ్యాయి. బాధితులు అడిగిన పరిహారం ఇచ్చేందుకు ప్రమాదానికి కారణమైన వ్యక్తి, అతడి తరఫువారు అంగీకరించకపోవడంతో బాధిత కుటుంబానికి చెందినవారు ఆగ్రహించి బస్టాండ్ ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. స్పందించిన పోలీసులు వారికి నచ్చజెప్పి రాస్తారోకో విరమింపజేశారు. పరిహారం ఇచ్చేందుకు మునుగోడు మండలం కమ్మగూడెంకు చెందిన కారు యజమాని అంగీకరించడంతో బాధిత కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

నల్లగొండ: లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ నోబుల్ ఆధ్వర్యంలో బుధవారం లయన్ నాగేశ్వరం మంచికంటి కుమారుడు చిరంజీవి తేజేశ్వరరావు జన్మదినం సందర్భంగా 19వ వార్డు పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో లయన్ రేపాల మదన్‌మోహన్, కర్నాటి విష్ణు, తంతెనపల్లి సైదులు, కృష్ణశేఖర్, యాస వెంకట్‌రెడ్డి, నాగిరెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పోటీ

గట్టుప్పల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పోటీలో ఉంటుందని సీపీఐ గట్టుప్పల్ మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గట్టుప్పల్ మండలంలో రెండు ఎంపీటీసీ స్థానాలు, రెండు గ్రామ పంచాయతీలకు పోటీలో ఉండేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను నల్లగొండ జిల్లా కేంద్రంలో కలిసి విన్నవించినట్లు వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

ఇరవై ఏళ్లుగా సొంతూళ్లోనే దసరా వేడుకలు

తిప్పర్తి: మండలంలోని జొన్నగడ్డలగూడెం గ్రామానికి చెందిన నామిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. ఆయన 20 ఏళ్లుగా దసరాకు సొంతూరు జొన్నగడ్డలగూడెం వచ్చి ఇక్కడే పండుగ జరుపుకుంటున్నారు. దసరా పండుగకు ఊరికి వస్తే కుటుంబ సభ్యులు, బంధువులు, చిన్ననాటి స్నేహితులు అందరూ కలుస్తారని, తల్లిదండ్రుల మధ్యన దసరా జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని ఆయన పేర్కొంటున్నారు. సొంత ఊరిలో ఉన్న సంతోషం ఎక్కడా లేదంటున్నారు. ఆంధ్రా ప్రాంత ప్రజలు సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లినట్లు, తెలంగాణలో పెద్ద పండుగ అయిన దసరాకు కూడా ఇక్కడి వారు సొంతూళ్లకు వెళ్తుంటారని ఆయన అన్నారు.



కుటుంబ సభ్యులతో శ్రీకాంత్‌రెడ్డి

చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేయాలి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

నార్కట్‌పల్లి: చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ వెంటనే అమలు చేయాలని తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పోచం వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహానికి తెలంగాణ చేనేత ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోచం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జియో ట్యాగ్ కలిగిన చేనేత కార్మికులకు రూ.లక్ష వరకు షరతులు లేకుండా రుణమాఫీని వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మునిపంపుల చేనేత సహకార సంఘం డైరెక్టర్ రాపోలు వెంకటేశం, వనం మార్కొండయ్య, దేవలపల్లి మల్లేష్, కోమటి యాదగిరి, కోమటి మణెమ్మలు పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ సభ్యులు

నల్లగొండ: లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ నోబుల్ ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ పట్టణంలోని రివర్ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ సభ్యులు 10 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సెకండ్ వైస్ గవర్నర్ కోడె సతీష్, జోన్ చైర్‌పర్సన్ కర్నాటి విష్ణు, క్లబ్ అధ్యక్షుడు నిమ్మల పిచ్చయ్య, నోబుల్ అధ్యక్షుడు తంతెనపల్లి సైదులు, బుర్రి కృష్ణశేఖర్, యాస వెంకట్‌రెడ్డి, సులిగిరి నాగిరెడ్డి, రవీందర్ కొండేటి, ముల్కు నాగిరెడ్డి, ముప్పిడి మల్లయ్య పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు పక్షుల గూళ్లు



కరెంటు తీగలకు గూళ్లు కట్టుకున్న పక్షులు

తిప్పర్తి : మండలంలోని రామలింగాలగూడెం గ్రామ సమీపంలోని శ్రీ భక్త మార్కెండేయ స్వామి ఆలయం వెనుక పంట పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. దీనికితోడు పక్షులు, పిచ్చుకలు విద్యుత్ తీగలకు గూళ్లు నిర్మించుకున్నాయి. చూపరులకు ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. పొలాలకు వెళ్లే రైతుల చేతుల అందే ఎత్తులో తీగలు ఉన్నాయి.

రాజకీయ పార్టీల జెండాలు తొలగింపు

కేతేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కేతేపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో రాజకీయ పార్టీ దిమ్మెలకు పంచాయతీ సిబ్బంది ముసుగులు తొడిగారు. అదేవిధంగా ప్రధాన రోడ్లు, వీధుల వెంట ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను, వాల్ పోస్టర్‌లను తొలగించారు. గోడలపై రాజకీయ పార్టీల రాతాలు కనబడకుండా సున్నం వేయించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు.



కేతేపల్లి : రాజకీయ పార్టీల దిమ్మెలకు ముసుగులు తొడుగుతున్న గ్రామపంచాయతీ సిబ్బంది

వాసవి క్లబ్ పూర్వ అధ్యక్షులకు సన్మానం

నకిరేకల్ : వాసవి క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నకిరేకల్‌లోని వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో బుధవారం ఆ క్లబ్ పూర్వ అధ్యక్షులు గుండా గోపి, ఉప్పల సంతోష్, వీరవెల్లినాథ్, మిట్టపల్లి యాదగిరిలను సన్మానించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగాం కోఆర్డినేటర్ దేవరశెట్టి సత్యనారాయణ, జోన్ చైర్మన్ గుండా నరేందర్, క్లబ్ కపుల్స్ ఉపాధ్యక్షుడు కందగట్ల బాలాజీ, సెక్రటరీ శీకాకోళ్ల వెంకన్న, ప్రతినిధులు బ్రహ్మదేవర వేణు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీఓ



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తిప్పర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఈ నెల తొమ్మిది నుంచి ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో బుధవారం ఎంపీడీఓ సుధాకర్ తిప్పర్తి మండల సమాఖ్య కార్యాలయంలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నామినేషన్ కేంద్రంలో విద్యుత్, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ అల్తాఫ్, సిబ్బంది, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ ఖాజా తదితరులు ఉన్నారు.

విజయదశమి పండుగ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కట్టంగూర్ : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్టార్ జనరల్ స్టోర్ సహకారంతో లయన్స్ క్లబ్ సభ్యులు కట్టంగూర్‌లో దసరా కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ క్లబ్ అధ్యక్షుడు చిక్కు శేఖర్ మాట్లాడుతూ దాతల సహకారంతో పండుగ విశిష్ట తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాలను మండల వ్యాప్తంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కట్టంగూర్ మండల ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరపత్రాల దాత కటికం రాములుగౌడ్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు రెడ్డిపల్లి సాగర్, కల్లూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, కోశాధికారి పి.రాములు, క్లబ్ సభ్యులు కడవేరు మల్లికార్జున్, బొడ్డుపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.